వైభవంగా శోభకృత్ నామ సంవత్సర వేడుకలు


ప్రత్యేక అలంకారంలో విజయదుర్గామాత


బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు


నృసింహస్వామి ఆలయంలో పూజలు

- ఆలయాలకు బారులు తీరిన భక్తులు
- నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

మంగళగిరి: శోభకృత్ నామ సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా గుమ్మాలు, తలుపులు ప్రత్యేకంగా పూలదండలతో మామిడి ఆకులతో అలంకరించి ఉగాదికి స్వాగతం పలికారు. ఇళ్ళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక ప్రసాదాలు పాయసం , పులిహోర, గారెలు, పానకం, వడపప్పులతో పూజలు నిర్వహించి స్వీకరించారు. శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ఉదయం తిరుంజనోత్సవం నిర్వహించగా ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావుతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు. తెల్లవారుజామునుంచే స్వామి వారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తుల సందడితో కోలాహలంగా మారింది. ఉత్సవానికి నరసాపురానికి చెందిన కుర్రా తాయారమ్మ, మంగళగిరికి చెందిన దేవతి రంజిత్ కుమార్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన వాకా ప్రభావతి, మంగారావు, వెంకట నాగేశ్వర శర్మ, అనుపమ కామేశ్వరి, నటుకుల శ్రీరాం, హేమాంజిలి వ్యవహరించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ శోభాకృత్ నామ సంవత్సరం ఉగాదిని పురష్కరించుకుని శనగల శేషాంజనేయగోపాల్ పంచాంగ శ్రవణం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి వారు బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన నందికంటి వెంకట హనుమాన్ ప్రసాద్ వ్యవహరించారు. ఉత్సవాల అనంతరం స్వామి వారు అద్దాల మహల్ పవళింపు సేవలో గులాబి పువ్వులతో సహస్రనామార్చనతో సేద తీరగా ఉత్సవానికి కై ంకర్యపరులుగా విజయవాడకు చెందిన పారేపల్లి కనకవల్లి తాయారమ్మ వ్యవహరించగా ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి ఉత్సవాలను పర్యవేక్షించారు.

అనంతవరం ఆలయంలో..

అనంతవరం(తాడికొండ): శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా తుళ్ళూరు మండలం అనంతవరంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వినిపించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఆలయాల్లో ఉగాదిశోభ

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాలను శోభకృత్ నామ సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయాన్నే అర్చకులు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా అందజేశారు. సాయంత్రం వేదపండితుడు వెంకటేశ్వరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. సీతారామాలయంలో అర్చకులు రాజేంద్రశర్మ స్వామివార్లకు అష్టోత్తర,సహస్తనామ పూజలు చేశారు. వాసవీమాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరుడికి అర్చకులు ఉమాపతి శాస్త్రి ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మకు అర్చకులు అయ్యన్నశాస్త్రి కుంకుమపూజలు చేసి భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేశారు. 113 తాళ్ళూరులోని వేణుగోపాల, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రసన్నమూర్తి విశేషపూజలు, అర్చనలు చేసి ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా అందజేశారు.


పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు

మహంకాళీ అమ్మవారి దేవాలయంలో..

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. ఉదయం 9 గంటల నుంచి పంచాంగ శ్రవణం చేశారు. ప్రారంభించి వచ్చిన భక్తులకు పంచాంగాలతో పాటు వెంకటేశ్వర స్వామి, అలివేలుమంగ చిత్రపటాలను అందజేశారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి యూనిఫాం, అర్చకులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ చిన వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నృసింహుని సేవలో రాష్ట్ర మంత్రి ఆలూరి జయరాం

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి ఆలూరి జయరాం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ దిగువ సన్నిధులలో స్వామి వారిని దర్శించుకున్న మంత్రి జయరాం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా వుండగా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న రోజులలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.


నృసింహస్వామి ఆలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఆలూరి జయరాం

ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: అరండల్‌పేటలో బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా విశేష సేవలందించిన ప్రముఖులకు ఉగాది పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముందుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నోరి నారాయణ మూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సభకు ఆవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావుకు జీవిత సాఫల్య పురస్కారం, ప్రముఖ రచయిత చిట్టిప్రోలు వెంకటరత్నానికి కవిరత్న పురస్కారం, మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మట్టుపల్లి సత్యనాగమోహన్‌కు ఉగాది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు టి.రాంబాబు, కార్యదర్శి వి.రాధాకృష్ణయ్య, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, బి.ఎల్.ఆదినారాయణ, డాక్టర్ పి.రాధాబాయి, కె.వి.ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.



చిట్టిప్రోలు వెంకటరత్నం దంపతులను సత్కరిస్తున్న ఆవోపా సభ్యులు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టం

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు విశిష్టమైనవని ప్రభుత్వ పాఠ్య పుస్తక డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలో భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని సామాజిక సేవా కార్యక్రమాల దిశగా ప్రోత్సహిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ మన సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా మంచి కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఉప్పాల రామ్మోహనరావు, బీఎస్‌జీ జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఈ.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు టి.అంకమ్మరావు, సుబ్బారావు, మాలకొండయ్య, ఏపీసీఓసీ జిల్లా అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.


రవీంద్రనాథ్‌రెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రతినిధులు

24 నుంచి సువార్త సభలు

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు సువార్తసభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.జాన్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాక్యోపదేశకులుగా గుంటూరుకు చెందిన డాక్టర్ యల్.క్లారెన్స్ శాస్త్రి, కె.నెహెమ్యా, గాయకుడు దియ్యాప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ


వేదికపై హనుమాన్ చాలీసా పారాయణ

తెనాలి: ఉగాది పర్వదినాన పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్యాత్మిక వేడుకకు వేదికైంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన ఉగాది వేడుకల్లో భాగంగా తొలుత ములుకుట్ల విశ్వనాథశర్మచే పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం 'సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం' సాగింది. వేదికపై హనుమత్ సమేత సీతారామలక్ష్మణ విగ్రహాలకు పూజించి కార్యక్రమాన్ని ఆరంభించారు. శ్రీహనుమాన్ సేవాసమితి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం వేదికపై హనుమాన్ చాలీసా పారాయణ చేయగా, ప్రాంగణంలోని 1108 మంది భక్తులు గళం కలిపారు. వీరిలో అత్యధికులు మహిళా భక్తులే ఉన్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేకంగా హాజరయ్యారు. తులసీదాస్ స్వరపరిచిన నలభై శ్లోకాలే హనుమాన్ చాలీసాగా ఆయన చెప్పారు. ఇవన్నీ ద్విపదలో ఉంటాయన్నారు. హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఎంతోకాలంగా ఒక యజ్ఞంగా నిర్వహిస్తూ సమాజంలో ఆధ్యాత్మిక భక్తిభావనలు వెల్లివిరిసేలా కృషిచేస్తున్న శ్రీహనుమాన్ సేవాసమితిని ఎమ్మెల్యే శివకుమార్ అభినందించారు. జ్యోతిని వెలిగించిన శ్రీహనుమాన్ సేవాసమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. దుష్టశక్తులను దూరం చేస్తాయనీ, శనిగ్రహ ప్రభావం తగ్గుతుందనీ, సవాళ్లను దీటుగా ఎదుర్కొనే శక్తినీ, ధైర్యాన్నీ కలిగిస్తుందని చెప్పారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దేవస్థానం పాలకవర్గ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, తెనాలి అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ధాకా సాంబిరెడ్డి, చుండూరు సాయి, మద్దాళి శేషాచలం, చుండూరి వెంకట శివప్రసాద్, భాస్కరుని లక్ష్మీనారాయణ, రావూరి సుబ్బారావు, కఠారి హరీష్ పాల్గొన్నారు.


గళం కలిపిన ప్రాంగణంలోని భక్తులు.. ఎమ్మెల్యే శివకుమార్

క్లుప్తంగా

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో మురుగుడు హనుమంతరావు కాలనీకి బుధవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేశారు. స్థానికులు పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయినట్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేశారు. అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ ఆధ్వర్యంలో పైపులైన్లకు మరమ్మలు నిర్వహించి సాయంత్రానికి తాగునీటిని పునరుద్ధరించారు.

పాఠశాలలో వసతుల కల్పనకు చర్యలు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లు, గదులకు తలుపులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యపై స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సొంత నిధులతో పాఠశాల టాయిలెట్లు, గదులకు తలుపులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

కళాకారుడు వసంతరాయుడుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం స్త్రీజన్మ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం జీవితచక్రం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు బొమ్మిడి వీరభోగ వసంతరాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేజళ్ల ఉమామహేశ్వర్, గద్దిపాటి బాలచంద్రకుమార్, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడండి



తెనాలిఅర్బన్: భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా ఉపయోగించాలని 22వ బెటాలియన్ అధికారి సుబేదార్ దేవందల్, హవల్దార్ కపిల్ దేవ్‌లు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నీటి లభ్యతను, దానిని పొదుపుగా వాడే విధానాన్ని ప్రజలకు తెలియజేశారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎ.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ వి.రమేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.నవీన్‌రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలి టౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా ఆంజనేయం ధ్యాన యోగమండలి ఆధ్వర్యంలో రత్నాటాకీస్ సెంటర్‌లోని రైతుబజారులో బుధవారం తులసి ఆకుల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యోగాచార్యులు కిషోర్ గురూజీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి తాడిబోయిన శివరామకృష్ణ ప్రజలకు తాగునీరందించారు. ఈసందర్భంగా కిషోర్‌గురూజీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది పర్వదినం రోజున తులసి ఆకులు, లవంగం పొడి కలిపి మట్టికుండలో భద్రపరిచిన మినరల్ వాటర్‌ను బాటసారులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. యోగ సభ్యులు పురుషోత్తమ కృష్ణస్వామి, చెంచయ్య స్వామిల వితరణతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తాడికొండ శ్రీనివాసరావు, గుప్తా స్వామిజీ, ముంతా శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, సుబ్బారావు, సుజాత, ప్రసాద్, శాంతి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ లింగారావు సెంటరులోని లింగారావు ఇంట్లో నివసముండే నన్నపనేని హేమలత దంపతులు కొద్ది రోజుల కిందట తెలంగాణలో ఉంటున్న వారి కుమారుడి వద్దకు వెళ్లారు. మంగళవారం తిరిగి రాగా ఆ తాళం పగులగొట్టి ఉంది. పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు ఇంటిని పరిశీలించారు. రూ. 12 లక్షల విలువైన బంగారం, రూ. 40 వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై గురువారం వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముందుగా అంతర్జాతీయ కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో..

అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఉగాది పురస్కరించుకుని గురువారం పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులకు పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

శాలివాహనులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండ

పెదనందిపాడు: శాలివాహనులకు (కుమ్మర్లు) ప్రభుత్వం అన్ని విధాలుగా అండంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ చీమకుర్తి లోకేష్ తెలిపారు. పెదనందిపాడులో బుధవారం జరిగిన శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాలివాహనుల చేతివృత్తిని బలోపేతం చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, జగనన్న చేదోడు పథకం వారికి వర్తిస్తుందని చెప్పారు. శాలివాహన చక్రవర్తి గొప్పతనం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం శాలివాహన చక్రవర్తి జయంతి కేకును కట్ చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ మండల అధ్యక్షుడు చల్లగిరి శ్రీనివాసరావు, సభ్యులు కానుగల నాగభూషణం, పకీరరావు, సాయిబాబు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

గోరంట్ల శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: తెలుగు ప్రజలంతా ఈ ఏడాది శ్రీ వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు, సుఖసంతోషాలతో జీవించాలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ఆకాంక్షించారు. గోరంట్ల శ్రీ వేంకటేశ్వరాలయంలో బుధవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మచరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్, ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత మాణిక్యవేల్, స్థానిక కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మ, యర్రంశెట్టి సూరి, గుడి సతీష్‌కుమార్, గాజుల సాయిరాం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడిపందేల రాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన రుద్రవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ విజయచంద్ర వివరాల మేరకు.. రుద్రవరం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామ సమీపంలోని పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,150 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పన్ను వసూలు లక్ష్యం చేరేనా!

- విలీన గ్రామాలలో పేరుకుపోయిన బకాయిలు
- నెలాఖరులోపు పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహరించాలంటున్న అధికారులు

మంగళగిరి: నగరంలో పన్నుల వసూలుపై అధికారులు దృష్టి పెట్టారు. మార్చి నెలాఖరుకు పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 21 వ తేదీ వరకు మరో రూ.8.72 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. తాగునీటి పన్నులు వసూలు ఇప్పటి వరకు 50 శాతం కూడా వసూలు కాలేదు. ఖాళీ స్థలాల పన్నుల వసూలుపై అధికారులు దృష్టి సారించకపోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. మంగళగిరి పట్టణంలో 18,166 నివాసాలుండగా రూ.8.97 కోట్లకు గాను రూ.7.04 కోట్లు వసూలు చేసి 79.18 శాతం పూర్తి చేశారు. విలీన గ్రామాలలో 22,447 నివాసాలుండగా రూ.8.37 కోట్లకు గాను రూ.5.35 కోట్లు మాత్రమే వసూలు చేశారు. తాడేపల్లి పట్టణంలో 18,653 నివాసాలుండగా రూ.10కోట్లకు గాను రూ.7.60 కోట్లు వసూలు చేశారు. విలీన గ్రామాలలో 15743 నివాసాలుండగా రూ.5.12 కోట్లకు గాను రూ.3.62 కోట్లు వసూలు చేశారు.

విలీన గ్రామాల్లో..

విలీన గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగానే పన్నులు వసూలు లక్ష్యం చేరుకోవడం లేదని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. విలీన గ్రామాలలో మేజర్ గ్రామాలైన కాజ, యర్రబాలెం లాంటి గ్రామాలలో పన్నులు వసూలు 60 శాతానికి మించకపోవడం లేదు. మరో 9 రోజులలో మార్చి నెలాఖరు పూర్తి కానుండగా పన్నులు వసూలు లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.


మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం

ఎంటీఎంసీ పరిధిలో..	
ఇళ్ల సంఖ్య	75, 009
పన్ను లక్ష్యం	రూ.32.49 కోట్లు
ఇప్పటి వరకు వసూలు	రూ.23.76 కోట్లు

నెలాఖరులోగా వసూలు పూర్తి చేస్తాం



నగర పాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 73.14 శాతానికి చేరింది. ఈ నెలాఖరులోపు పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేసి నగరాన్ని అభివృద్ధి పరచేలా చర్యలు తీసుకుంటున్నాం. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలలో సుమారు 80 శాతం వసూలు కాగా విలీన గ్రామాల్లో కొంతమేర పన్నులు వసూలు తగ్గింది

యు.శారదాదేవి, కమిషనర్ ఎంటీఎంసీ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేబ్రోలు: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం సైకిల్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో బుధవారం జరిగింది. మండల కేంద్రమైన చేబ్రోలుకు చెందిన వృద్ధుడు మురికిపూడి ప్రసాద్ సైకిల్‌పై నారాకోడూరు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ సమయంలో నారాకోడూరు తెనాలి రోడ్డులోని మలుపు వద్ద స్కూటీపై వేగంగా వస్తున్న యువకులు ఢీ కొట్టారు. ఈ సంఘటనలో వృద్ధుడు ప్రసాద్ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. స్కూటీపై ఉన్న గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు సాయికృష్ణ, రాఘవ కూడా గాయపడ్డారు. స్కూటీ ముందు భాగం దెబ్బతింది. ముగ్గురిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: మల్లవరం పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 23 వేలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.